# స్వయంపాకం

-ప్రతాప రవిశంకర్



"స్వయంపాకం మొదలుపెట్టారా?"

స్టవ్ మీద గిన్నె పెడుతున్న వాడిని గబుక్కున వెనక్కు తిరిగి చూశాను.

గుమ్మం దగ్గర నవ్వుతూ నిలబడింది చైతన్య. ఆమెకు రోజూ ఇది మామూలే—స్టవ్ మీద అన్నం వండటానికి గిన్నె పెట్టే టైముకు వచ్చి, "స్వయంపాకం మొదలుపెట్టారా?" అని అడగడం.

తల వూపాను.

అక్కడే నిలబడి ఉంది చైతన్య. ఆమెను నేను లోపలకు రమ్మని అనలేదు. ఎందుకంటే, నా గదిలో కూర్చోటానికి ఒక చిన్న చాప తప్పించి ఇంకేమీ లేవు. చైతన్యను కింద కూర్చోమనడం నాకు ఇష్టం లేదు. ఎందుకంటే, ఆమె ఇంటి వాళ్ళ అమ్మాయి. ఒకే ఒక్క కూతురు. అంటే పూర్తిగా ఆ ఇంటి యజమాని.

కత్తితో వంకాయ ముక్కలు తరగడం మొదలు పెట్టాను.

నవ్వింది చైతన్య.

"మీ నోపిక్కి నాజోహార్లు, వంటల రావుగారూ" అన్నది ఆమె కిలకిలా నవ్వి.

"వంటలరావుగారా!" అన్నాను గబుక్కున.

"అవును. వంట చెయ్యడంలో మీకు ఉన్న నోపికను, సహనాన్ని గుర్తించి ఈ బిరుదు ఇస్తున్నాను" అన్న దామె.

"థాంక్స్" అన్నాను నవ్వి.

"పోనీ, వంకాయలు నేను ముక్కలు చెయ్యనా?" అన్న దామె.

"వద్దండి. మీ కెందుకు శ్రమ?"

"మీరు శ్రమ పడుతుంటే చూడలేకుండా ఉన్నాను."

"అసలు చూడకండి."

"చూడకుండా ఎలాగ? ఇంట్లో ఒక గది మీకు అద్దెకు ఇచ్చినప్పుడు మీ కష్ట సుఖాలు చూడక తప్పుతుందా?"

"మీ మంచి మనసుకు నా కృతజ్ఞతలు."

"పోనీ, మీరు హాయిగా హోటల్లో భోజనం చెయ్యకూడదూ?"

"హోటల్లోనా? !"అన్నాను వెంటనే.

నేను చేస్తున్న చిన్న ఉద్యోగానికి వచ్చేదే నాలుగు వందలు. అందులో రెండు వందలు ఇంటికి పంపించాలి. ఇక మిగిలే రెండు వందల్లో హోటల్లో భోజనం చేస్తే నా పని ఖాళీ."

"డబ్బులు ఎక్కువవుతాయనా?" అడిగింది చైతన్య— అక్కడినుంచి కొంచెం కదిలి ముందుకు వచ్చి.

తల వూపాను.

"పోనీ, హాయిగా పెళ్ళి చేసుకోకూడదూ?"

"పెళ్ళా!"

"అవునండీ. పెళ్ళే...మీకే."

"అప్పుడే ఏం తొందరండీ?" అన్నాను.

"ఇప్పుడు మీకు ఎన్నేళ్ళు? పన్నెండేళ్ళా?"

నవ్వాను ఆమె అలా అనేసరికి.

"చెప్పండి. మీకు పెళ్ళంటే భయం కదూ?" అడిగింది చైతన్య, నా కళ్ళలోకి చూస్తూ.

"భయమా? ఎందుకు?" అన్నాను.

"ఎందుకో మీకు తెలియదూ?" అన్న దామె.

ఉలిక్కి పడ్డాను. నిజమే. పెళ్ళంటే నాకు భయమే. నేను పెళ్ళి చేసుకుంటే నా వాళ్ళందరూ ఏమయి పోతారు? నేను వాళ్ళకు ఏం సహాయం చెయ్యగలను? చదవడానికి అయితే ఎమ్. కామ్. చదివాను. కాని, వచ్చిన ఉద్యోగం? నాకు వచ్చే జీతానికి పెళ్ళి కూడానా?

"క్షమించండి. నేను చాలా దూరం వెళ్ళుతున్నాను. నాకు తొందర పాటు ఎక్కువ. వస్తాను" అని అక్కడినుంచి వెళ్ళిపోయింది చైతన్య.

ఆమె వెళ్ళిన తరవాత స్టవ్ మీద చప్పుడు చేస్తూ ఉడుకుతున్న అన్నాన్ని చూస్తూ ఉండి పోయాను చాలా సేపటి వరకూ.

ఆఫీసు నుంచి వచ్చేసరికి వరండాలో చైతన్య, ఆమె తండ్రి జనార్దనరావుగారు కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

"ఏమోయ్! ఇవాళ అయిదున్నరకే వచ్చేశావ్?" అడిగా డాయన.

"ఇవాళ పని తక్కువగా ఉందండీ" అన్నాను.

"మీరు ఈ గదిలో చేరిన ఇన్ని నెలల్లో ఇదే మొదటిసారి అనుకుంటాను, ఇలా అయిదున్నరకు రావటం" అన్నది చైతన్య.

తల వూపాను ముందుకు కదులుతూ.

వెళ్ళి నా గది తాళం తీసి, తలుపు తెరిచి లోపలకు వెళ్ళి కిటికీ తలుపులు తీశాను.

వెలుతురు లోపలకు వచ్చింది.

ఇక మళ్ళీ వంట ప్రయత్నాలు మొదలు పెట్టాలి. ఈ మధ్య ఆరు గంటల నించీ కరెంటు పోతూంది రోజూ ఇబ్బంది గానే ఉంది.

స్టవ్ దగ్గరకు వెళ్ళాను లుంగీ కట్టుకుని.

"మళ్ళీ మొదలా మీ స్వయంపాకం?"

గుమ్మం దగ్గర చైతన్య ప్రత్యక్షమయింది. అప్పుడే వంట మొదలు పెడుతున్నానంటే

ఆమె నవ్వుతుందని, "కాదు, బ్రష్ తుడుస్తున్నాను" అన్నాను.

"మీకు ఇక ఆఫీసు పని, వంట పని తప్పింది ప్రపంచంలో ఇంకేమీ కనిపించడం లేదా?" అన్నా నేను అక్కడే నిలబడి.

మాట్లాడలేకపోయాను. అవును, నాకు ఈ రెండూ తప్పితే ఇంకేముంటాయి? బతకడానికి తినాలి. తినడానికి ఉద్యోగం చెయ్యాలి.

"మీరు ఈ గదిలోకి వచ్చిన తరవాత ఒక్క సినిమా కయినా వెళ్ళారా?" మాటగా నన్నే చూస్తూ అడిగింది.

ఏం చెప్పగలను? నిజంగానే ఒక్క సినిమాకూడా చూడలేదు. సినిమా చూస్తే ఖర్చు. ఆ డబ్బులు ఇంకేమయినా ముఖ్యమయినవి కొనడానికి ఉపయోగ పడతాయి.

"ఇవాళ మనం సినిమాకు వెడదాం."

"మనమంటే? నేనుకూడానా?" తత్తరపడుతూ అన్నాను.

"అవును. మీరు, నేను, అమ్మ, నాన్న నలుగురం."

"క్షమించండి. నేను రాలేను. నేను వంట చేసుకోవాలి."

"మీ వంట పాడు కాను! ఇవాళ మీ భోజనం కూడా మా ఇంట్లోనే సరేనా?"

"వద్దండీ. నేను రాలేను."

"అలా అంటే కుదరదు. ఇది నా ఆహ్వానం కాదు. మా నాన్న మీకు ఈ విషయం చెప్పమన్నారు."

"నిజమా?"

"అవును. త్వరగా ఆరు గంటల కల్లా రెడీ కండి. స్వయంపాకం వద్దు" అన్నది చైతన్య వెళ్ళిపోతూ.

* * * *

కరెంటు పోయింది. అంతా చీకటిగా ఉన్నా, డాబా మీద పడుకున్న నాకు నక్షత్రాల వెలుగు కనిపిస్తూంది. నా జీవితం గురించీ, చైతన్య నా పట్ల తీసుకుంటున్న ఆసక్తి గురించీ ఆలోచిస్తూ పడుకున్నాను.

ఒక్క చైతన్యే కాదు, ఆమె తల్లీ, తండ్రీ కూడా నేనంటే మంచి ఆసక్తి చూపుతున్నారు. నా మంచి చెడులు విచారిస్తున్నారు. నా కష్ట సుఖాలు తెలుసుకుంటున్నారు. ఎందుకు? కేవలం నా బతుకు మీద జాలేనా ఇందుకు కారణం?

డిగ్రీ పాసయిన చైతన్య, వయస్సుకి తగిన ఆస్తికి వారసురాలయిన చైతన్య నా గురించి ఎందుకింతగా శ్రద్ధ తీసుకుంటూంది? చైతన్యతో నా అనుబంధం ఎంత దూరం వెడుతుంది? ఊహించని పరిణామాలకూ దారి తియ్యదు కదా? ఏమో!

"కలలు కంటున్నారా చుక్కలను చూస్తూ?"

ఉలిక్కి పడ్డాను.

డాబా మీదకు వచ్చింది చైతన్య.

లేచాను. నిలబడబోతున్నప్పుడు, "వద్దు. పరవా లేదు. కూర్చోండి. నేనూ ఇక్కడ కూర్చుంటాను" అని చాప మీద ఒక చివర కూర్చుంది ఆమె.

"చెప్పండి, మీరు మీ జీవితం గురించి ఆలో చిస్తున్నారు కదూ?" నవ్వుతూనే అడిగింది.

ఆమె కళ్ళలోకి చూశాను. కళ్ళు చీకట్లో, చుక్కల వెలుగులో మెరుస్తూ కనిపించాయి.

"నా ఆలోచన నిజమే కదూ?"

తల వూపాను.

"భయపడకండి. ఎప్పుడూ చీకటే ఉండదు. మనం ఇలాగే ఈ చీకట్లో కూర్చుంటే ఇంకొన్ని గంటలకు సూర్యుడు వస్తాడు. వెలుగు వస్తుంది. నేను ఆశా వాదిని, మాస్టారూ. ఆప్టిమిస్ట్‌ని. మీకో శుభవార్త చెబుదామని వచ్చాను."

"ఏమిటి?" ఆత్రతగా అడిగాను.

"రేణుకా ఎంటర్ ప్రయిజెస్ ఆఫీసులో అకౌంటెంట్ ఉద్యోగం ఖాళీ అయింది. మీరు అప్లికేషన్ పెడితే నాన్న రికమెండ్ చేస్తామన్నారు. మీకు తప్పకుండా ఉద్యోగం వస్తుంది. జీతం ఎనిమిది వందలకు పైనే. ఏమంటారు?" గాలికి రెపరెప లాడుతున్న ముంగురులను అదుపులో ఉంచుతూ అడిగింది ఆమె.

ఏమనగలను? ఇది నిజమేనా? నాకు ఆ ఉద్యోగం



తప్పకుండా వస్తుందా? అదే జరిగితే నా కంటే అదృష్టవంతుడు ఎవరు ఉంటారు?

"మాట్లాడరేం?"

"ఏం మాట్లాడను? నాకు మాటలు రావటం లేదు. మీ అభిమానానికి నా కృతజ్ఞతలు ఎలా వెల్లడించుకోవాలో తెలియడం లేదు."

"మీరు వెల్లడించుకో వద్దు. ముందు రేపు అప్లికేషన్ రాసివ్వండి. ఉద్యోగం వచ్చిన తరవాత మీ కృతజ్ఞతల వెల్లడింపు కార్యక్రమం."

నవ్వింది చైతన్య.

ఎంత హాయిగా నవ్వగలదు అనిపించింది. అవును. చైతన్య కేమిటి? ఆమెకు ఏం దిగులు ఉంది? ఆమె జీవితం నవ్వుల మయం. చైతన్యను చేసుకునే అదృష్టవంతుడు ఎవరో?

* * *

'రేణుకా ఎంటర్‌ప్రైజెస్' అక్కౌంటెంట్ పోస్టు ఇంటర్వ్యూకు వెళ్ళాను. అక్కడి వాళ్ళు నన్ను ఎటువంటి చిక్కు ప్రశ్నలతో ఇబ్బంది పెట్ట లేదు. బహుశః చైతన్య తండ్రి రికమెండేషన్ అందుకు కారణం కావచ్చు.

ఇంటర్వ్యూ జరిగిన నాలుగు రోజులకు నాకు ఆ ఉద్యోగం వచ్చినట్టు వాళ్ళు తెలియపరిచారు. ఇక నా సంతోషానికి అవధులు లేవు. చైతన్య తండ్రి కాళ్ళమీద పడినంత పని చేశాను. ఆయన నన్ను ఆప్యాయంగా పట్టుకుని, "ఇందులో నేను చేసింది ఏమీ లేదు. అంతా నీ అదృష్టం" అన్నాడు. అంతా అబద్ధం! ఇందుకు కారణం ఆయనే.

ఇంటికి ఉత్తరం వ్రాశాను. నా జీతం ఎంతో కూడా వ్రాశాను. నా తల్లిదండ్రుల కలలూ, నన్ను చదివించటానికి వాళ్ళు పడిన శ్రమా ఫలించా యని వ్రాశాను. ఇంకా ఏవేవో చాలా వ్రాశాను. ఎన్ని వ్రాసినా తృప్తి అనిపించలేదు.

నాకు తెలిసిన మాటల్లో చైతన్యకు నా కృత జ్ఞతలు తెలియజేశాను. ఆమె నన్ను ఎప్పటిలానే వెడిసించింది.

"నేను గుర్తుంటానా?" అన్నది.

పెద్దగా నవ్వాను.

"మీరు గుర్తుండక పోవడం ఏమిటి? నన్ను నేను మరచి పోవడం సాధ్యం కావచ్చు. కాని, మిమ్మల్ని మరచి పోగలనా?" అన్నాను.

"అయితే ఫరవాలేదు. మీకు చెప్పడం మరిచి పోయాను. రేపు రాత్రికి మేము వూరికి వెళ్ళు తున్నాం. వారం రోజుల తరవాత కానీ తిరిగి రాము. ఈ వారం రోజులూ ఇంటి కాపలా మీదే" అన్న దామె.

సరే నన్నాను.

* * *

ఆ రోజునే ఉద్యోగంలో జాయినయాను. ఇంతకు ముందు చేసిన ఉద్యోగానికీ, ఈ ఉద్యోగానికీ ఎంతో భేదం కనిపించింది. ఇప్పటి హోదా వేరు.

మిగిలిన ఉద్యోగుల కోరిక మీద అందరికీ చిన్న పార్టీ ఇచ్చాను. అందరూ నాకు తమ అభినందనలు తెలియజేశారు. వాళ్ళు నా కిస్తున్న గౌరవం నాకు సంతోషాన్ని కలిగించింది.

సాయంత్రమయింది.

అది ప్రయివేటు ఫర్మ్ అయినా వర్కింగ్ అవర్స్ విషయంలో స్ట్రిక్ట్ రూల్సు పాటిస్తారు. అందుకే అయిదున్నర కాగానే అందరూ వర్కు ముగించి బయట పడడం మొదలు పెట్టారు.

అప్పుడే నా దగ్గరకు వచ్చాడు ఒక సీనియర్ ఉద్యోగి.

"ఇంతకీ మీ వివాహం ఎప్పుడో చెప్పలేదు" అన్నా డతను నవ్వుతూ.

"నా వివాహమా?!" ఆశ్చర్యంగా అడిగాను.

"అవును. మీ మారేజే. జనార్దనరావుగారి కూతురితో..."

నిజంగా నా కేమీ అర్థం కాలేదు.

"వివరంగా చెప్పండి" అన్నాను.

"ఏమిటి, సార్, అలా ఆశ్చర్యపోతారు? జనార్దన రావు గారే చెప్పారు—మీరు ఆయనకు కాబోయే అల్లుడనీ, అందుకే ఈ ఉద్యోగం మీకు ఇప్పించ మనీ రికమండ్ చెయ్యడమే కాకుండా ఎనిమిదివేల వరకూ క్యాష్ కూడా ఇచ్చారు."

నా నెత్తిమీద పిడుగులు పడుతున్న ట్లనిపిం చింది.

జరిగింది ఇదా?!

జనార్దనరావుగారు ఇందుకా నా కీ ఉద్యోగం ఇప్పించింది? నా కోసం ఎనిమిది వేలు ఖర్చు పెట్టారా? ఎందుకు? నన్ను తన అల్లుడుగా చేసుకోవడానికా? ఇది ఆయనకు వచ్చిన ఆలోచనేనా? బహుశా అయి ఉండదు. చైతన్య ఆయనకు చెప్పి ఉంటుంది. అవును ... చైతన్య మాటకు ఆ ఇంట్లో ఎదురు లేదు.

ఈ వార్త తెలిసినందుకు నేను సంతోషించాలా? విచారపడాలా?

నిజానికి ఇంకొకరు ఎవరయినా అయితే సంతోష పడే వాళ్ళేమో, చైతన్యకు భర్త, అంతటి ఆస్తికి వారసు డవుతున్నందుకు.

కాని, నాకు సంతోషం కలగలేదు. విచారమే కలిగింది.

ఆఫీసునుంచి బయటికి వచ్చాను. హోటలుకు వెళ్ళి కాఫీ తాగాను.

నా మెదడు నిండా ఇదే ఆలోచన. ఇప్పుడు నా కేమిటి దారి?

గదికి వచ్చాను.

గది తాళం తియ్యకుండా డాబా మీదకు వెళ్ళాను.

కళ్ళముందు చైతన్య వివిధ విన్యాసాలతో ప్రత్యక్ష మవుతోంది. ఆమె మాటల్లో నా మీద కనబరిచే జాలి గుర్తుకు వస్తోంది.

చైతన్య అంటే నాకు ప్రేమ లేదు; ఇష్టం లేదు; కోరిక లేదు. ఆమె మీద నేను ఏ రోజూ ఆశలు పెంచుకోలేదు. అందని పెత్తనానికి ఎగరాలని దురాశ పడలేదు. అయినా నాకు ఒక అవకాశం వచ్చింది.

ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలా? వదులు కోవాలా?

ఎంతోసేపు ఆలోచించి ఈ గొప్ప అవకాశాన్ని వదులుకోవడానికే నిర్ణయించుకున్నాను.

ఎందుకంటే, చైతన్యకు నా జీవితం తెలుసు. బ్రతుకుపట్ల నాకు ఉన్న భయం తెలుసు. అందుకే ఆమెకు నేనంటే, నా బ్రతుకంటే అంతులేని జాలి. ఆ జాలికొద్దీ నాకు చేరువ అయింది. ఆ జాలితోటే నాకు ఉద్యోగం వచ్చేలా చేసింది. ఆ జాలితోనే నన్ను పెళ్ళి చేసుకోవడానికి నిర్ణయించుకొంది.

ఒక స్నేహితురాలుగా, నా శ్రేయోభిలాషిగా ఆమె జాలిని నేను భరించగలను. కాని, రేపు భర్తగా ఆమె జాలిని నేను భరించలేను. ఒకవేళ భరించాలిగితే నాకు మిగిలేది నరకమే!



లలితా చిత్రం

ఛాయ: ... (కొల్లాపూర్)

అందుకే నాకు చైతన్య వద్దు. ఆమె జాలిపడి ఇప్పించిన ఈ ఉద్యోగమూ వద్దు. ఏమీ వద్దు.

క్రిందికి వచ్చాను. గది తలుపులు తెరిచి అప్పటి కప్పుడే నా ఉద్యోగానికి రాజీనామా వ్రాసేశాను. ఆ తర్వాత గదిలో సామాన్లను సర్దడం మొదలు పెట్టాను.

రేపే ఈ గది ఖాళీ చెయ్యాలి.

ఇంకో గదికి వెళ్ళితే చైతన్య అక్కడకు కూడా వస్తుందా? వచ్చి ఎప్పటిలాగే నవ్వుతూ "స్వయం పాకం మొదలుపెట్టారా?" అనిఅంటుందా? ఏమో?!

*